# గిరిజాది గోడు



మూలనున్న దేముదుకుండ వైపు చూసి చేతులుజోడించి మొక్కింది ముత్తెవమ్మ ఏమీ లేదు, ఆమెది చిన్న కోరికే: 'పండగ సంతోషంగా గడిచి పోవాలని, డ్యూటీకి వెళ్ళిన తన భర్త భోజనానికి రావాలని, అంతే.'

ఆమెకు ఆ దేముదంటే చాలా నమ్మకముంది. గిరిజనుల్లో ఓ కులం వాళ్ళది. పది సంవత్సరాల క్రితం ఆమెభర్త చిన్నయ్య కొత్త ఇల్లుకట్టి ఆ ఇంట్లో ఆ దేవుణ్ణి ప్రతిష్ఠించాడు దేముడు అంటే అది విగ్రహం కాదు, పటంకాదు. ఒక మంచి ముహూర్తాన మంచి మట్టి తెచ్చి, కుండ చేయించాడు చిన్నయ్య. తను కట్టుకొన్న కొత్తఇంటి మూల ఆవుపేడతో అలికించి కుల ఆచారప్రకారం తమ కులగురువుని పిల్చి పూజచేయించి ఆ చోటున మేకను కోయించి, అదే స్తలంలో స్నానంచేసి తెల్లబట్టకట్టి కొండవాగునుంచి పెద్ద గూనలో ముత్తెవమ్మ తెచ్చిన మంచి నీటిని, దేముడికుండలో పోసి ప్రతిష్ఠింప చేశాడు. దేముడి కుండకు కుంకుమ, కాటుక, పసుపు,పువ్వులు పెట్టి ఊదొత్తు పుల్ల వెలిగించి దీపారాధన చేస్తుంది.

కావిలిపాటి విజయలక్ష్మి



ప్రతి సోమ లక్ష్మివారాలు ముత్తెవమ్మ తలస్నానం చేసి, ఆ ఇంటిని ఆవుపేడతో అలికి, తెల్లటి బట్టకట్టి తెచ్చిన మంచి నీరు, కుండలోని పాతనీరు వొంపి, పోస్తుంది ముత్తెవమ్మ.

దేవుడిని ప్రతిష్ఠించిన సంవత్సరం లోనే చిన్నయ్యకు ప్రెసిడెంటు, బ్లాకాఫీసర్ దగ్గర సేవక్ ఉద్యోగం వేయించాడు. దేవుడికుండమీద భక్తి ప్రపత్తులు హెచ్చాయి ఆ దంపతులకు. గడచిన ఈ పదిసంవత్సరాల్లో ముగ్గురు బిడ్డలు కలిగారు వారికి. అంతా బాగున్నారు. అంతేకాదు గతసంవత్సరం ఇదే రోజున పెద్దకొడుకు పెంటన్నకి పెద్ద గండం తప్పింది.

అరుగుచివర పెట్టిన ప్రమిదలో దీపం వెలుగుతూనే ఉంది. ఇంకా పూర్తిగా గూడెం నిద్దురపోలేదు. తాగి వచ్చిన బొజ్జన్న అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. అటునుంచి ఇటు వత్తిగిలి కప్పుకున్న గళ్ళ ముతకదుప్పటి సరిగా కప్పుకుంటూ యధాలాపంగా చూశాడు. తనకు రెండు అడుగుల దూరంలో అద మరచి నిద్రపోతున్న కొడుకు పెంటన్న వైపు, అతని గుండెలమీద మటంవేసుకుని కూర్చున్న పాముని, చిన్నయ్య. అతని గుండె గుభిల్లుమంది.

అతనికి దిక్కుతోచలేదు. ఇప్పుడు తానేంచెయ్యాలో, కొడుకుని ఎలా దక్కించుకోవాలో, అతనికి కంగారుగా ఉంది. గుండె దడదడా కొట్టుకోవటం ప్రారంభించింది. రెప్పవాల్చటం మరచి అలానే నిద్రపోతున్న కొడుకువైపు పామువైపు చూస్తున్నాడు చిన్నయ్య.


అటకమీదినుంచి ఎలుకలు రెండు తగువులాడి జారి క్రిందపడ్డాయి పాముకి దగ్గరలోనే. పాము కదిలింది. చిన్నయ్య చేతులుజోడించి నీళ్ళకుండ దేముణ్ణి ధ్యానించి మొక్కాడు తన కొడుకుని రక్షించమని. తర్వాత పాముకి మొక్కాడు తమను వదిలివెళ్ళమని. తర్వాత కనులు తెరిచి చూశాడు. బుడ్డి దీపం వెల్తురులో ఆ ఇంటి గోడలోకి ఉన్న చిన్న కలుగులోకి వెళ్ళిపోతూంది పాము.

దీర్ఘంగా తేలిగ్గా నిట్టూర్చి, భార్యను లేపాడు. అతను చెప్పిన విషయం విని ఆమె భయంతో గుండెమీద చెయ్యుంచుకుంది. తమ దేముడే రక్షించాడని నమ్మకంగా మొక్కింది. మర్నాడు దంపతులిద్దరూ, కొబ్బరికాయ దేముడిమూల కొట్టి దీపారాధన చేశారు.

తను ఆలస్యంగా రావటానికి కారణం చెపుతూ తమ కులదేవత తమ దైవం గురించి చెప్పిన చిన్నయ్యవైపు చూసి గలగలా నవ్వాడు మేనేజరు. "మేం మిమ్మల్ని బాగుచెయ్యాలనీ మీ మూర్ఖత్వం పోగొట్టాలనీ ఈ అడవుల్లో పడిచస్తున్నాంగాని మీరు మారటం లేదయ్యా. నీళ్ళకుండకు దణ్ణంపెట్టడం కాక, ఆ పాము నీ ఇంటిగోడలోనే ఉంటుంది, కొట్టించెయ్," అన్నాడు.

"పాముని కొట్టడం పాపమండి," అన్నాడు చిన్నయ్య. కాని మళ్ళీ ఆ రాత్రే ఇంట్లో కనిపించిన పాముని ఉపేక్షించలేకపోయాడు. దణ్ణంపెట్టి వదలలేకపోయాడు. తను, తన భార్య, పిల్లలు, పామువల్ల ప్రమాదం, మేనేజరు నవ్వు, మీరింత అమాయకులేమిటయ్యా అన్నట్లు అతని హెచ్చరిక, మూలనున్న ఖడితకఱ్ఱతో ఒకే వేటుకి పాముని చంపేశాడు.

భర్తకు పాముని చంపిన పాపం అంటకూడదని, మర్నాడు పూజలు చేసింది ముత్తెవమ్మ. పాము నుంచి




తాము నమ్మి పూజించే దేవుడే రక్షించాడని వారి నమ్మకం.

"ఇంకా మొక్కుతున్నావా? వంటెప్పుడు సేత్తావు?" వాకిట్లో వెదురు చాపమీద ఎండకి కూర్చున్న ముత్తెవమ్మ అత్త లచ్చుమమ్మ పెద్ద గొంతుతో అనటంతో, "నీ కొడుకు డూటీనుంచి వచ్చేసరికి వంట అవుద్దిలే," అంది వాకిట్లోకి వచ్చి ముత్తెవమ్మ.

"మా సిన్నతనాల్లో ఈ పండగ మనకి లేదు. వాల్మీకులు సేసుకునోరు. ఏటో కాలం మారిపోనాది. ఖర్చులు నావయిపోనాయి. తిండికి వాసిపోతన్నాము," అంది ముసలమ్మ.

"నీ కాలంలో జీతమెరుగుదువా? ఉద్యోగమెరుగుదువా? కాలినడకన పోయీ ఓ రంటసింతపండు అడాకులు, ఏజన్సీ దినుసులు పట్టుకుని మాడుగుల సంతకి, గోర్నమెంటుబాబులు రోడ్డేసి పదుపాయం సెయ్యాబట్టిగద, బస్సెక్కి ఏతకన్న పోతన్నవు. నీ కాలంలో ఏటున్నది? కోకలున్నయ్యా రయికలున్నయ్యా, టీ నీళ్ళు తాగినావేటి?"

బోసినోరు ఆవలించి చిన్న శబ్దమయ్యేలా నవ్వింది లచ్చుమమ్మ. "మా కాలమంతవు? నువ్వెప్పుడన్నా అడవి ఎనుముమాసం తిన్నవ? ఆరోజుల్ల ఏటకెళ్ళి ఎనుముని కొట్టారంటె గూడెమంత పండుగ సేసుకునోరం. ఏటో గోర్నమెంటు నీకు సేసింది? ఊరుమీదబడి మేకం గొఱ్ఱెల్ని తిన్నదాన్ని కొట్టగూడదంటారు. ఎవసాయంపనినేర్పుకోకుంటు గుంటల్ని సదుగు సదుగని బల్లోకి తోలుమంతరు. ఇల్లు కట్టండని ఏపుకు తింటున్నరు, ఏటి గోర్నమెంటుసేసింది" అంది లచ్చుమమ్మ.

"పల్లకొ, పల్లకొ, తెల్లటి గుడ్డ, కమ్మనికూడు ఎరుగుదువేటి? గోర్నమెంటోళ్ళుఒచ్చిమనకి 'తెలివి సెబుత్రాను. ఓపాలి మయిలామండలికేసి వచ్చి సూడు, పెసిడెంటమ్మని అడుగు సెబుతాది" అంది ముత్తెవమ్మ.

"ఏటి వంట సేత్తావో సెబుదు, నాకెందుకయ్యావ్ని కాలం తీరిపోనాది." అంది లచ్చుమమ్మ.

"నీ కొడుకు వత్తాడో రాడో? రాత్తిరి కొండుత గారెలు బూరులు ఆడొత్తె. ఒండి మూతెట్టు."

"కుట్టుకాయలుంచరు. అటకమీదెట్టు" అంది ముసలమ్మ.

అవాళగూడెమంతా పండగ సంబరం అలుముకుంది. కసపులువూడిచి కల్లాపు జల్లి ముగ్గులుపెట్టారు. అరుగులు అలికి రంగవల్లులు తీర్చారు. స్నానాలు చేసి కొండవాగునుంచి కడవలలో నీళ్లు నింపి ఎవరి దేముడికి వాళ్ళు దీపారాధన చేశారు. కొందరి ఇళ్ళల్లో వెంకటరమణమూర్తి పఠాలు ఉన్నాయి. ఆ గూడెం మొత్తంమీద అందరిలో చిన్నయ్యే ఉద్యోగస్థుడు. ముత్తెవమ్మకి అదొక గర్వం. ఆ ఊరి ప్రెసిడెంటుకి ఇద్దరు భార్యలు. రెండవభార్య మహిళా మండలి ప్రెసిడెంటు ఆమె భర్తతోపాటు తాగుతుంది. ఆ గూడెంలో ముత్తెవమ్మ మరికొందరు స్త్రీలు తప్ప అంతా తాగుతారు. అవాళ దీపావళి కనుక మాంసం తినరు. కాయకూరలే తింటారు.

వంట ప్రారంభించింది ముత్తెవమ్మ.

లచ్చుమమ్మ దీపావళి గడచిపోయిన తన జీవితం నెమరువేసుకుంటూంది. పూర్వం ఈ రోజుల్లో చలి ఎముకలు కొరికేది. పగలూ రాత్రి గడపలో నెగడు వెలుగుతూ ఉండేది. రాత్రి తను తన భర్తా పిల్లలూ ఇంట్లో నెగడు చుట్టూ నేల వెచ్చబడిన తరువాత ఉత్త నేలనే కాళ్ళు ముడుచుకొని పడుకునే వారు. తర్వాత తన భర్త మాడుగుల షావుకారు నడిగి చింకిగోనెలు తెచ్చాడు. భర్త స్మృతితో ఆమె పెదవులు విచ్చుకున్నాయి. గతంలోని అగతం ఆమె కనులముందు మెదిలింది. ధముకు. సంత బెల్లం, ఉప్పు, గింజలిచ్చి కొనటానికి వెళ్ళింది తను. అక్కడ తన మనసు పట్టేసినాడు పొడవుగా పచ్చగా గిరజాల జుత్తుతో ఉన్న బొజ్జయ్య. మరొక రెండు సంతలు గడిచేసరికి మాటలు కలిశాయి. అతను పెళ్లాన్ని ఇద్దరు పిల్లల్ని వదిలాడు తనకోసం. తను వదిలేసింది అతనికోసం, పదినెలల చిన్నయ్యని, పదేళ్ళ శోంబేరిని, తనను నమ్మిన

భర్తనీను. తర్వాత పెద్ద తగవు పెట్టారు. గ్రామపెద్దలు కర్రలు కత్తులూ పట్టుకుని కయ్యానికి వచ్చారు. బొజ్జయ్య భయపడకని తనను బుజ్జగించాడు. మగనాలి చెల్లించాడు తను తేలిగ్గా ఊపిరి వదిలింది మళ్ళీ తన కడుపు పండాలని బొజ్జయ్య పిల్లలకు తల్లి కావాలని ఎందరి దేవుళ్ళకి మొక్కిందీ? అదేం శాపమో! మూగగా వదిలివచ్చిన తన పిల్లలే శపించారో ఆ భర్త శపించాడో తను మళ్ళీ తల్లి కాలేకపోయింది.

భర్తపోయి, గరువుముక్కలుగుడిసె దాయాదులు లాక్కున్న తర్వాత వెతుక్కుంటూ సిగ్గుగా, పశ్చాత్తాపంతో వచ్చిన తనను చిన్నయ్య ఎలా చూశాడు? ఆ చూపులో ఎంత చీత్కారం? తనను పలకరించకుండానే చుట్టాల గదిలో దేముడి కుండకు మొక్కుతున్న భార్య దగ్గరకెళ్ళి అన్నాడు. తనకింకా ఆరోజు జ్ఞాపకముంది. ఆ మాటలు చెవుల్లో గింగురుమంటాయి.


'మాయమ్మ వచ్చింది. అది నన్ను సిన్న కుర్రోడిగా ఉన్నప్పుడు ఒగ్గిసింది. పాలుతాగే ఓణ్ని ఒగ్గేసింది. దానికి అన్నం పెట్టకపోయినా సూడకపోయినా నాకు పాపముండదు.' కోపంతో అంటున్నాడు చిన్నయ్య.

'పల్లకో, పల్లకో, ఇప్పుడేడకిపోతది. అన్ని ఇంటన్నవు కద' ముత్తెవమ్మ గొంతు. ఎంత మంచిది కోడలు! తన కనులెందుకో చెమ్మగిల్లాయి.

"కాళ్ళు కడుక్కో." తెల్లగా తోమిన ఇత్తడి ముంతతో నీళ్ళిచ్చింది, లచ్చుమమ్మకి ముత్తెవమ్మ. తర్వాత అంబలి గిన్నె తెచ్చి "కూరేసుకో. తిను" అని తనముందు పెట్టింది.

చిన్నయ్య మాట్లాడకుండా లేచి పోయాడు.

"ఏడ కెల్తన్నడు సిన్నయ్య?" అడిగింది కోడల్ని.




"పెసిడెంటుకాడఉద్యోగ మొచ్చింది, ఎల్తన్నాడు" అంది ముత్తెవమ్మ. అదేసంవత్సరం బ్లాకాఫీసులో సెవక్ ఉద్యోగం వేయించి తన దగ్గరే చిన్నయ్యని వేయించుకున్నాడు సమితి ప్రెసిడెంటు సత్యం. సత్యం పెళ్ళాం మత్తుగా తాగిన మైకంలో ఓ రోజు చిన్నయ్యను వాటేసుకొని గదిలోకి లాక్కుపోయింది. ఆమెతో పెనుగులాడి విడిపించుకుబయట పడిన చిన్నయ్య అలసిపోయి 'ఆడదానికింత సత్తు ఉంటదా!' అని విస్తుపోయాడు.

తర్వాత తనకు ట్రాన్స్ఫరు ఇప్పించమని కోరుతూ ఆఫీసులో 'జరిగిన విషయం' చిన్నయ్య చెబుతూంటె విరగబడి నవ్వారు స్టాఫంతా.

నాలుగు రోజులనాడు సూపర్‌వైజర్ దగ్గరకు బదిలీ అయిపోయాడు చిన్నయ్య. ఎందరో సూపర్‌వైజర్లు వచ్చారు, వెళ్ళారు. అందరిదగ్గరా మంచి పేరు తెచ్చుకున్నాడు చిన్నయ్య. అతని మంచితనాన్ని ఆసరాగా తీసుకుని అతని సేవాపరతత్వాన్ని గ్రహించి అతన్ని అన్ని పనులకు ఉపయోగించుకొంటున్నారు అధికారులు.

ఇప్పుడున్న సూపర్‌వైజర్ భార్య అయితే మధ్యాహ్నం గంజిమెతుకులు పడేసి అతనిచేత వంటఇంటి పనులు అన్నీ చేయించుకుంటూ మహారాణిలా సుఖపడిపోయింది. చాలీచాలని గంజి మెతుకులతో రోజంతా ఉండిపోవటం వలన నీరసించిపోతున్నాడు చిన్నయ్య.


"నాను మధ్యాహ్నం ఉండను అని సెప్పు. నీ కష్టసుఖాలు బి.డి.వోతో సెప్పుకో. వంట సెయ్యను. బట్టలుతకను. అది నా ఉద్యోగం కాదు అని సెప్పు" అంటోంది ముత్తెవమ్మ. భర్తను చూస్తే జాలి, అధికారుల ఆగడానికి ఆగ్రహం వెళ్ళగక్కుతూ.

తల అడ్డంగా ఊపినవ్వాడు చిన్నయ్య. 'అళ్ళంతా ఒకటేనె. జీతం తింటున్నావు కద సెయ్యాల అంటారు' అంటూ.

* * *

అమ్మగారు వెనకనుంచి చెబుతుంటే వంట పూర్తిచేశాడు చిన్నయ్య. గారెల పప్పు రుబ్బి పెరుగు గారెలూ పాకం గారెలూ అయ్యేసరికి వంటిగంట దాటింది టైము.

వీధిలో ఉన్న బోరింగు దగ్గర కాళ్ల




చేతులు ముఖం కడుక్కొని, అలసటగా అక్కడే చింతచెట్టు నీడన కాస్సేపు చతికిలబడి కూర్చొని, 'మధ్యాహ్నం భోజనానికి రా, ఇయ్యాల్టికి సాయంత్రం సెలవడగిరా' అని ఒకటికి నాలుగుసార్లు చెప్పిన ముత్తెవమ్మ గుర్తువచ్చింది. ఎల్లా లనుకుంటూ లేచి నిల్చొని మరొకసారి భుజంమీది చింకితువాలుతో ముఖం చేతులు తుడుచుకున్నాడు చిన్నయ్య.

"అమ్మా ఇంటికి వెళ్తాను." వినయంగా చెప్పాడు చిన్నయ్య.

చురుగ్గా అతనివైపు చూసింది కమలమణి. "అయ్యగారు భోజనానికి రాలేదు. ఎలా వెళ్తావయ్యా!" అంది విసుగ్గా.

"మా యాడమనిసి...." ఏదో చెప్ప బోయాడు చిన్నయ్య.

కస్సుమంది కమలమణి. "ఇవ్వాళ నువ్వు ఇంటికి వెళ్ళటానికి వీల్లేదు. బోలెడు పనులున్నాయి. గిన్నె లెవరు కడుగుతారు? మతాబాలు కట్టాలి. పెద్దబ్బాయి వస్తున్నాడు. బస్సు చూడు వెళ్ళి. పట్నం నుంచి వచ్చే బస్సుకు టైమయింది. నువ్వెళితే నేను ఈ చాకిరీ చెయ్యలేను బాబూ? నా వంట్లో బాగా లేదు," అంది కమలమణి గబగబా.

మరి లాభంలేదు. తానేమన్నా ఆమె ఆజ్ఞను తిరస్కరించటానికి ప్రయత్నిస్తే చిలవలు పలవలు అల్లి అయ్యగారికి రిపోర్టు చేస్తుంది. అతను నోటికి వచ్చినట్లు తిడతాడు అనుకున్న చిన్నయ్య బుఱ్ఱగోక్కుంటూ రోడ్డు వైపు నడిచాడు.

అతనికో అనుమానం. అమ్మగారెప్పుడూ వంట్లో బాగోలేదంటుంది. ఆమె కేమిటి రోగం. మనిషి దుక్కలా గుంది. పసువులా పగలంతా ఏవో తింటూనే ఉంటుంది అనుకుంటాడు కసిగా.

మూగగా మొక్కుతాడు మూలనున్న కుండకి; మా సూపర్‌వైజరుకి ట్రాన్స్ఫరయిపోవాల. సూపర్‌వైజర్ బ్లాకు తినేస్తున్నాడట, నన్ను అమ్మగారు తినేస్తున్నది అని.

సుపర్‌వైజర్‌గారి పెద్దబ్బాయి టిప్‌టాప్‌గా పట్నంనుంచి వచ్చాడు. యింట్లో ఒకటే హడావుడి. అమ్మగారు పురమాయించే పనులకి అంతూపంతూ లేదు. అందరి భోజనాలు అయిన తర్వాత, చిన్నయ్య ఆకుముందు కూచునే సరికి టైము మూడుగంటలయ్యింది.

"అయ్యో ఇవ్వాళ గంజి పారబోశానోయ్, అబ్బాయి వచ్చిన సందడిలో. చారు పోసుకు తినేసెయ్," అంది కమలమణి. కూర మిగలలేదు. పప్పు మిగల లేదు. అవి ఎప్పుడూ మిగలవు. ఆమె చాలా పొదుపరి. గారెలు రాత్రికి మూత పెట్టింది. చిన్నయ్యా! ఇంకా మెత్తగా రుబ్బాలి అని పిండి పట్టిచూసి కమలమణి చెబుతూంటే బబ్బలు నెప్పిపుట్టేలా పప్పు రుబ్బేడు చిన్నయ్య. అతని విస్తట్లో మాడిపోయిన ఒక్క గారె ముక్క. అతనికి అమ్మగారిని అమాంతం నమిలి మింగెయ్యాలన్నంత పిచ్చికోపం వచ్చింది. కాని ఏం చెయ్యగలడు? మళ్ళీ జన్మలో తను సూపర్‌వైజరు భార్యగా పుట్టాలి. ఈమె సేవక్ చిన్నయ్యగా పుట్టాలి. అప్పుడు, అప్పుడు .... చల్లారి బిరుసెక్కిన అన్నం మెతుకులు చారులో గట్టిగా పిసికి, కసిగా నమిలి మింగాడు చిన్నయ్య.

గంజి లేదు. చారు మెతుకులు. కడుపులో మంటగా ఉంటే, "అమ్మగారూ గుక్కెడు మజ్జిగ నీళ్ళు పొయ్యండి" అని నోరు తెరచి అడిగాడు చిన్నయ్య.

ఆమె భుక్తాయాసంతో తేన్చి నవ్వింది. "మజ్జిగ నీళ్ళెక్కడ! ఈ రాత్రికి దాస్తానులే గంజి. పాపం మీకు అలవాటు. ఈ ఏజెన్సీ వచ్చి పాలు, మజ్జిగ వాచిపోతున్నాం చిన్నయ్యా! ఆ! అబ్బాయి మతాబాలు కడుతున్నాడు, వెళ్ళు" అంది.

అబ్బాయిగారున్న గదిలోకి నడిచాడు చిన్నయ్య.

మౌనంగా కాయితంగొట్టాల్లో మందు కూరుతున్న చిన్నయ్యకు అనిపించింది తన పిల్లలకు నాలుగు మతాబులు కొని తీసుకు వెళ్ళాలని.

మతాబులు కట్టడం పూర్తి అయ్యేసరికి సాయంత్రం ఐదుగంటలుదాటిపోయింది. కమలమణి సాయంత్రం వంట ప్రారంభించమంది. "అమ్మగారూ...." ఏదో చెప్పబోయాడు చిన్నయ్య.

"అబ్బాయికి పులావంటే ఇష్టం. మళ్ళీ రేపు ఉదయం వెళ్ళిపోతాడట. ఆ మసాలా నూరి, కొబ్బరి పాలు తియ్యాలి. గబగబా కానియ్. అయ్యగారింటింకి వచ్చేసరికి అన్నీ అయిపోవాలి," తొందరచేసింది కమలామణి.

వంట పనులు చిన్నయ్య చేత చేయిస్తూ, తాను స్నానంచేసి పట్టుచీర కట్టి దీపాలు అమర్చింది. ఆమె దేవుని దగ్గర దీపం వెలిగించింది. ఆదరాబాదరా అయ్యగారు వచ్చి అలశ్యానికి క్షమాపణ చెప్పుకున్నాడు. ఆ అలశ్యానికి బుంగమూతి పెట్టి చిన్న అమ్మాయిలా చిరుకోపం ప్రదర్శించింది.


తనను తొందరగా రమ్మని మరీ మరీ చెప్పిన ముత్తెవమ్మ గుర్తుకు వచ్చింది చిన్నయ్యకు. అతని ప్రాణం ఉసూరుమంది. ఛీ. ఏం బతుకులు అనుకున్నాడు. వంట పూర్తిఅయ్యే దాకా అతనికి 'వెళ్తాను' అని చెప్పే అవకాశం ఇవ్వలేదెవరూ.

"చిన్నయ్యా బలే కాలుతున్నాయి మతాబులు. చూడు." సూపర్ వైజర్ గారి గారాల అమ్మాయి రజని చిన్నయ్యను పిల్చి చెప్పింది.

అప్పటికి టైమెంతయిందో తెలియదు చిన్నయ్యకు. ఇంటికి వెళ్తాను అని చెప్పటానికి వచ్చి వీధి వరండా అంచున నిల్చున్నాడు తువ్వాలు బుజాల చుట్టూ కప్పుకుంటూ.

"బాగున్నాయమ్మా!" బలవంతాన పెదాలమీదికి నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు చిన్నయ్య. తర్వాత చెప్పాడు 'అమ్మగారూ ఎల్తాను' అని.

దానికి గలగలా నవ్విందావిడ. అతని అమాయకత్వానికి అయిఉంటుంది. తర్వాత అయ్యగారు అన్నాడు.— "బోలెడు వంట మిగిలింది తినిపడుకోవయ్యా. గంట పదయ్యింది




ఇప్పుడేం వెళతావు వంటరిగా. మెకం తిరుగుతూందన్నావు కదా!" అని.

టైము పదిఅయిపోయింది. బరువుగా బాధగా తలవంచి నిట్టూర్చాడు చిన్నయ్య. నెల రోజులుగా, మేకలనూ పసువులనూ తినేస్తూ మెకం గూడెం ప్రజలను గడగడ లాడిస్తోంది. రాత్రిపూట ఎవ్వరూ బయటకు రావటం లేదు. ఇప్పుడు తను వంటరిగా గూడెం వెళ్ళలేడు. సాహసిస్తే ప్రమాదమే అనుకున్న చిన్నయ్య, తను ఇంటికి వెళ్ళటం మర్నాటి ఉదయానికి వాయిదా వేశాడు.

రాత్రి పన్నెండు గంటల వేళ ఇల్లు కడుగుతూ అనుకున్నాడు చిన్నయ్య. అయ్యగారు ఉదయం పెందలాడే లేస్తాడో లేదో, అమ్మగారు వెళ్ళనివ్వదు. ఇప్పుడే అయ్యగారికి చెప్పాలి. ఆ ఆలోచన వచ్చిన వెంటనే చీపురు వదిలేసి వీధి వరండాలో సిగరెట్ కాలుస్తూ ఈజీ చైర్లో పడుకున్న అయ్యగారి దగ్గరకువెళ్ళి చెప్పాడు, రేపు ఉదయం ఇంటికి వెళ్ళి మళ్ళీ వస్తాను సార్ అని.

అ.... అని అంగీకారం తెలిపాడు సూపర్ వైజర్ నిద్ర ఆవరిస్తుంటే అప్పుడతను మాట్లాడించినందుకు విసుగ్గా.

మర్నాటి ఉదయం ఇంకా మంచు తెరలు విడకముందు అమ్మగారూ పిల్లలూ లేవకముందు, వీధి తాళం తీసుకొని వడివడిగా గూడెం వైపు నడిచాడు చిన్నయ్య.

"ఎల్లు ఎల్లు. నీకు పెల్లమక్కర లేదు, పిల్లలక్కర లేదు. ఉద్యోగమే కావాలి" అని కనుల కమ్మిన నీరు వత్తుకుంది ముత్తెవమ్మ.

"ఏటి సెయ్యాల?" అని విరక్తిగా నవ్వి, "ఉద్యోగమెందుకు! నీ కోసమేగా గద! మన ఆఫీసరుకి ట్రాన్స్ఫరయిపోవాలని దేవుడికి మొక్కుకో" అన్నాడు చిన్నయ్య, ఆమె తలను నిమిరి ఓదార్పుగా.

"నీ ఆఫీసరు బదిలీ అయిపోతే, దేవతకి మేకపిల్ల." కసిగా అంది ముత్తెవమ్మ. తర్వాత ముక్కు, కనులు పవిట చెంగుతో వత్తుకుంటూ, "నువ్వు సెప్పనేదా? ఇంటికి ఎల్లాలని, ఇయ్యాల్టికి సెలవిప్పించమని అడగలేదా?" అడిగింది.

మళ్ళీ అలానే నవ్వి "ఆఫీసరు మంచోడు కాపోతే అక్కడ స్టాఫుకేలేదు పండగ గిండగ. మనలాంటి గరీబోడి గోడెవడికి కావాలి," అన్నాడు చిన్నయ్య.